క్లుప్తంగా

వినియోగదారులకు ఉత్తమ సేవలందించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానందం



ఉయ్యూరు: వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కృష్ణాజిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.సత్యానందం సూచించారు. నూతనంగా నియమితులైన సత్యానందం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉయ్యూరు విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష చేశారు. ఎస్ఈ సత్యానందం మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలే లక్ష్యంగా పనిచేయాలన్నారు. విద్యుత్‌శాఖలో సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మెరుగ్గా సేవలు అందించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన ఎస్ఈ సత్యానందంను ఈఈ కృష్ణనాయక్ సత్కరించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఉయ్యూరు: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందించింది. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన విద్యార్థిని పామర్తి హరిత ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు శివశంకర్‌రావు, విజయలక్ష్మి పేదవారు. దీంతో విద్యార్థిని చదువు నిమిత్తం సంస్థ ప్రతినిధులు గురువారం ఉయ్యూరులో రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని విద్యార్థిని తండ్రికి అందజేశారు. సంస్థ చైర్మన్ కొలసాని రవి కుమార్, అధ్యక్షుడు సాకి రాజేష్, ప్రతినిధులు పారుపూడి శివకృష్ణ, మహంకాళి పవన్, ఫణికుమార్, నాగకుమార్ పాల్గొన్నారు.

కానూరు రోడ్డుకు లాల్ బహదూర్‌శాస్త్రి పేరు పెట్టాలి



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు 100 అడుగుల రోడ్డుకు లాల్ బహదూర్‌శాస్త్రి పేరు పెట్టాలని నాయీ బ్రాహ్మణ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు కోరారు. ఈ మేరకు ఆయన పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, భారత ప్రధానిగా స్వచ్ఛమైన సేవలు అందించిన లాల్ బహదూర్ శాస్త్రి పేరును 100 అడుగుల రోడ్డుకు నామకరణం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మురళీకృష్ణ, మారుతి సురేష్‌బాబు, అన్నవరపు శివపార్వతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపడతాం

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కానూరు మురళీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 14.60 లక్షలతో గురువారం శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై దృష్టి పెడుతున్నామని చెప్పారు. అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు మొదట చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మురళీనగర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ భవానీప్రసాద్, డీఈ రాజారావు, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవి, వెలగపూడి శంకర్‌బాబు పాల్గొన్నారు.

నీరా పరిశ్రమ యూనిట్లు ఏర్పాటు చేయాలి



ఉయ్యూరు: కల్లుగీతను ఆధునీకరించి నీరా పరిశ్రమ యూనిట్లను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాకా రామచంద్రరావు కోరారు. పట్టణంలో గురువారం కల్లుగీత కార్మిక సంఘం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబరులో విడుదలయ్యే నూతన కల్లువిధానం గీత కార్మికుల అభివృద్ధి, సంక్షేమం దిశగా ఉండాలన్నారు. ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించి గీత కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలన్నారు. గీత కార్మికులకు ఇచ్చే నష్టపరిహారం రూ. 10 లక్షలు ఎక్సైజ్ శాఖ నుంచి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పామర్తి వెంకటేశ్వరరావు, పరసా శ్రీను పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పెనమలూరు: పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇద్దరు అధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న లోయా శివశంకర్‌రావు ఉయ్యూరుకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి ఓంకార నాగేశ్వరరావు విధుల్లో చేరారు. అలాగే రెడ్డిగూడెం మండలం నుంచి బొమ్మసాని శ్రీనివాసరావు ఈవోపీ ఆర్డీగా బదిలీపై వచ్చారు. ఎంపీడీవోగా సునీతాశర్మ బదిలీపై ఇబ్రహీంపట్నంకు గురువారం రిలీవ్ అయ్యి వెళ్లారు.




కంకిపాడు శివాలయంలో బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు



శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా ఉయ్యూరులోని శ్రీవిజయ దుర్గాభవాని అమ్మవారు



శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ



యనమలకుదురులో బాలాత్రిపురసుందరీదేవిగా కనకదుర్గమ్మ అమ్మవారు



నున్న చినకంచిలో శ్రీకామాక్షి అమ్మవారు

వైభవంగా దసరా నవరాత్రులు ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన దేవి శరన్నవరాత్రులు
- తొలిరోజు శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



విద్యుత్ దీపాలు, సెట్టింగ్‌లతో సుందరంగా అలంకరించిన శ్రీపేరంటాలమ్మ ఆలయం



ఈడుపుగల్లు కాలువ కట్ట రోడ్డులో పూజలు చేస్తున్న భక్తులు, భవానీ మాలధారులు



అల్లాపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ రవి

కంకిపాడు: దసరా నవరాత్రులు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు ఆలయాల్లో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. కంకిపాడు, ప్రొద్దుటూరు శివాలయాల్లో కాశీ అన్నపూర్ణాదేవి బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో ధ్యాన యోగ సాయి మందిరంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీగా పూజలందుకున్నారు. కలశ స్థాపన, దంపత పూజలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈడుపుగల్లు కాలువ కట్ట రోడ్డులో జై దుర్గాభవాని సేవా సమితి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, పలువురు భవానీ మాలధారులు పూజల్లో పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరులోని శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం దసరా ఉత్సవాలు కలశస్థాపనతో మొదలయ్యాయి. తొలిరోజు అమ్మవారు రజత కవచాలంకృత అలంకారంలో పూజలందుకున్నారు. ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు. పట్టణంలోని తోట్లవల్లూరు రోడ్డు ఏజీకే నగర్‌లో వేంచేసిన శ్రీవిజయ దుర్గాభవాని దేవి ఆలయంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద ఓగిరాల, ముదునూరు, కాటూరు గ్రామాల్లోని ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో గురువారం దసరా నవరాత్రులు ప్రారంభమయ్యాయి. భక్తులకు అమ్మవార్లు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. తొలిరోజు విఘ్నేశ్వరపూజ, అఖండ దీపారాధన, కలశస్థాపనతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సీతారామ స్వామి భక్తసమాజం, చెదలవాడ ఆనంద్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. ఆలయ ఈఓ ప్రియాంక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రులు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. అల్లాపురంలో శ్రీదుర్గా భవాని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరుగుతున్న ఉత్సవాలను ఎంపీపీ అనగాని రవి ప్రారంభించారు. స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా పూజలందుకున్నారు. అలాగే సొసైటీపేటలోని శ్రీగాయత్రి మందిరంలో అమ్మవారిని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. కేసరపల్లి, దావాజీగూడెం, బుద్ధవరం, వీఎస్.పురం కాలనీలో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

పెనమలూరు: దసరా శరన్నవరాత్రులు మండల పరిధిలో గురువారం ప్రారంభయ్యాయి. యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకనక దుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఆలయ ఈఓ ఉన్నం వెంకట ప్రసాదరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు. పోరంకి శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో దసరా ఉత్సవాలను కమిటీ అధ్యక్షుడు అమ్నుంగి అర్జున్‌రెడ్డి ప్రారంభించారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని పలు దేవాలయాల్లో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి దేవస్థానం చినకంచిలో శ్రీకామాక్షి అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో నవరాత్రి ఉత్సవాలు, బాబావారి 106వ పుణ్యతిథి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చెరువు సెంటర్‌లోని శ్రీదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. బోడపాడులోని శ్రీగంగానమ్మ ఆలయం, శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వర స్వామివార్ల దేవాలయాల్లో శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి.

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో దసరా నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పురుషోత్తపట్నం శివాలయం, శ్రీ భువనేశ్వరీ అమ్మవారి ఆలయం, చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో దేవీశరన్నవరాత్రులు గురువారం ప్రారంభమయ్యాయి. ఆత్కూరులో వేంచేసిన కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అదేవిధంగా పొట్టిపాడు, పెద్ద అవుటపల్లి, తేలప్రోలు, మానికొండ తదితర గ్రామాల్లో అమ్మవారిని వివిధ అలంకారాల్లో భక్తులు పూజలు చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



గండిగుంటలో భానుమణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉయ్యూరు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి లో-ఓల్టేజీ సమస్యను అధికమిస్తున్నామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో వ్యాపారవేత్త వల్లభనేని భూషయ్య మాతృమూర్తి సత్యనాగ భానుమణి సంస్మరణ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. భానుమణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుమారులు భూషయ్య, చంద్రశేఖర్‌లను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు నిరంతరాయంగా తొమ్మిది గంటల విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖలో నూతన సంస్కరణలు తీసుకొచ్చి పటిష్ట పరుస్తున్నామని తెలిపారు. వరదల్లో లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు తీసుకున్నామని అన్నారు. నూతన లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి ప్రజలకు అండగా నిలిచామన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్ మీట్‌లో సత్తాచాటిన విద్యార్థులు



సత్తాచాటిన క్రీడాకారులతో కరస్పాండెంట్ ఎం. సాల్మన్‌రాజు

కంకిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పెనమలూరు నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో కంకిపాడు సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. క్రీడాకారులను పాఠశాల కరస్పాండెంట్ ఎం. సాల్మన్‌రాజు గురువారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో అథ్లెటిక్స్ మీట్ జరిగిందన్నారు. అండర్-17 బాలుర విభాగంలో 200 మీటర్ల కేటగిరీలో బి. ధోని ప్రథమస్థానాన్ని, 800 మీటర్లు, మూడు కిలోమీటర్ల పరుగులో వి. మణికంఠ ద్వితీయ స్థానంలో నిలిచాడని చెప్పారు. అండర్-14 బాలికల విభాగంలో 200మీటర్ల పరుగులో బి. జ్యోత్స్న తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. వీరు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. క్రీడాకారులు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను కరస్పాండెంట్ ఎం. సాల్మన్‌రాజు, ప్రిన్సిపాల్ సిస్టర్ చిత్ర అభినందించారు.

వరద బాధిత రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు

ఉయ్యూరు: వరద ముంపుతో నష్టపోయిన రైతాంగాన్ని పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక మానికొండ భవన్‌లో కౌలు రైతు సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కౌలురైతుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలన్నారు. వరదల్లో నష్టపోయిన ఉద్యాన రైతులకు ప్రభుత్వం ఇస్తున్న పరిహారం ఏ మాత్రం సరిపోదన్నారు. లక్షల్లో నష్టపోయిన రైతులకు వేలల్లో పరిహారం మంజూరు చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. వరదల్లో పాడైన బోర్లకు సాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. కౌలురైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 8న విజయవాడలో చేపట్టనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పంచకర్ల రంగారావు, కోసూరు శివనాగేంద్రం, నాయకుడు బుల్లయ్య పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ఇసుక మూటలే



యనమలకుదురులో రోడ్డు పక్కన ఇసుక మూటలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోకి ప్రవేశించగానే ఇసుక బస్తాలు దర్శనమిస్తున్నాయి. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే రోడ్డు పక్కన ఉన్నవి ధాన్యం బస్తాలో లేక ఎరువుల బస్తాలో అనుకుంటారు. అయితే వాస్తవానికి ఇసుక మాఫియా కొత్తరకంగా అక్రమ రవాణాకు తెరలేపారు. యనమలకుదురు ఇసుక క్వారీని చాలా ఏళ్ల క్రితమే ప్రభుత్వం నిషేధించింది. కనకదుర్గ వారధికి ప్రమాదం ఏర్పడుతుందని యనమలకుదురు వరకు కృష్ణానదిలో ఇసుక తవ్వకాలపై నిషేధం విధించింది. అయితే రెవెన్యూ, పోలీసుల అవినీతి కారణంగా ఇసుక మాఫియా రవాణాకు కొత్తదార్లు ఎన్నుకున్నారు. నదిలో ఇసుక బస్తాలు కట్టి బైక్, ఆటోలపై గ్రామంలోకి తీసుకువస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌లోకి లోడ్ చేసి బహిరంగా మార్కెట్‌లో ట్రాక్టర్ రూ. 7 వేలకు విక్రయిస్తున్నారు. యనమలకుదురులో ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టే అధికారులు జిల్లాలోనే లేరా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

నూర్‌బాషా ముస్లింలకు న్యాయం చేయాలి



పెనమలూరు: ముస్లింలకు సంబంధించిన ప్రభుత్వ పదవుల్లో నూర్‌బాషా ముస్లింలకు అన్యాయం జరుగుతోందని నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎంపీ వల్లభనేని బాలశౌరికి బుధవారం రాత్రి పోరంకిలో వినతిపత్రం అందజేశారు. చిన్నా వివరాలు తెలుపుతూ వక్ఫ్‌బోర్డు, హజ్ కమిటీ, ఉర్దూ అకాడమీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కమిటీల్లో నూర్‌బాషా నుంచి ఒక్కరు కూడా లేరన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది నూర్‌బాషా ముస్లింలు ఉన్నారని వారికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు షేక్ చినమాభిని, కృష్ణా జిల్లా అధ్యక్షురాలు షేక్ రంజాన్‌బీ పాల్గొన్నారు.

మద్యపానంతో కలిగే నష్టాలపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: మద్యం సేవించడం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బాపులపాడు మండలం కె. సీతారామపురంలో ఐపీసీ చర్చి ఆధ్వర్యాన గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్చి పాస్టర్ వై. సాల్మన్‌రాజు, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్, ప్రముఖ వైద్యుడు బలరామకృష్ణ మద్యపానం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మద్యం సేవించడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులపై ప్రజలకు ప్రొజెక్టర్ సాయంతో వీడియోలు ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంత ప్రజలను మద్యపానం నుంచి రక్షించేందుకు పాస్టర్ సాల్మన్‌రాజు చేస్తున్న కృషిని అభినందించారు. సర్పంచ్ చెన్నుబోయిన వెంకటమహాలక్ష్మీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెన్నుబోయిన శివయ్య పాల్గొన్నారు.

సున్నపురాయి తవ్వకాలు అవాస్తవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ప్రభుత్వ భూముల్లో సున్నపురాయి నిక్షేపాల అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తహసీల్దార్ వి.నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై కొద్దిరోజులుగా వివిధ మాధ్యమాల్లో వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పరిశీలించడంతో పాటు సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని తెలిపారు. మల్లవల్లి రీ సర్వే నంబర్ 164-3లో మందాడ వెంకట సుబ్బారావు అనే రైతుకు చెందిన రెండు ఎకరాల ప్రైవేట్ భూమిలో దాదాపు 10 ఏళ్ల క్రితం జరిగిన గ్రావెల్ క్వారీ గోతులు పూడ్చేందుకు సదరు రైతు తవ్వకాలు జరిగినట్లుగా విచారణలో తేలిందని పేర్కొన్నారు. కేవలం భూమి చదును చేసుకుని, మరొక పంట సాగు చేసుకోవాలనే ఉద్దేశంతో అనుమతి లేకుండా తవ్వకాలు జరిపిన విషయం వాస్తవమేనని, కానీ సున్నపురాయి లేదా విలువైన ఖనిజ నిక్షేపాల వంటివి ఈ భూమిలో ఏమి లేదని రైతు మందాడ వెంకట సుబ్బారావు రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారని తెలిపారు. అంతేకాక ఈ సున్నపురాయిని సమీపంలోని మరొక ఫ్యాక్టరీకి తరలించినట్లుగా ప్రచారం జరగడంతో సదరు ఫ్యాక్టరీ నిర్వాహకులతోనూ రెవిన్యూ అధికారులు లిఖితపూర్వక వాంగ్మూలం తీసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

రసాయన ఎరువులు తక్కువగా వాడాలి



పెదపులిపాకలో రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

పెనమలూరు: రైతులు రసాయన ఎరువులను తక్కువగా వాడాలని వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ మనోహర్ అన్నారు. పెదపులిపాక గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు, జీవ ఎరువులు వాడితే నేల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని చెప్పారు. ఏడీఏ ఎం. సునీల్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కనకమేడల శైలజ, ఏఏవోలు షరీఫ్, గోవర్ధిని, శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పంట పొలాల్లో డ్రోన్ల సాయంతో పురుగు మందులు పిచికారి చేసే విధానంపై డెమో నిర్వహించారు. డ్రోన్ ద్వారా పిచికారి చేయడం వల్ల రైతులకు సమయం, ఖర్చు, మందు పరిమాణం తగ్గుతుందని ఏవో ఎన్ఎల్ తేజస్వీ వివరించారు.

212 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో పాలడుగు లక్షణరావు, ప్రిన్సిపాల్ శివాజీబాబు

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో 212 మంది విద్యార్థులకు ఎసెంచర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన సందర్భంగా గురువారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో తమ కాలేజీలో ఇంజినీరింగ్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ తమ విద్యార్థులకు వార్షిక వేతనం రూ. 4.50 లక్షల నుంచి 6.50 లక్షల వరకు ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. గతంలో కూడా తమ విద్యార్థులు అనేక ఉద్యోగాలు పొంది స్థిరపడ్డారని వివరించారు. కార్యక్రమంలో ప్రాంగణ ఎంపిక విభాగాధిపతి రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నున్నలో గ్రామ సభ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో గురువారం గ్రామసభ జరిగింది. సభలో గ్రామంలోని వివిధ సమస్యల గురించి చర్చించారు. సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రజలను మభ్యపెట్టే విధంగా సమాధానం చెప్పవద్దని వాస్తవాలు వెల్లడించాలని గ్రామసభకు అధ్యక్షత వహించిన యర్కారెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శి జిటివి. రమణకు సూచించారు. మల్లేశ్వరీ టవర్స్ వద్ద డ్రైనేజీ సమస్య చాలా కాలం నుంచి ఉందని యర్కారెడ్డి బుజ్జి ఆ సమస్యను పరిష్కరించాలని అడిగారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు కిరువైపులా డ్రైనేజీ నిర్మించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు అడిగారు. అంతర్గత రోడ్డు వెడల్పు సరిపడ లేనిచోట అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించే దిశగా ఆలోచన చేసి పనులు చేయాలని జనసేన నాయకుడు పసుపులేటి భాస్కరరావు సూచించారు. గ్రామసభలో జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.